క్లుప్తంగా

నిత్యాన్నదాన భవనానికి రూ.50 వేల విరాళం



దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈఓ

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి పసలపూడికి చెందిన కర్రి కృష్ణారెడ్డి–సూర్యకుమారి దంపతులు రూ.50 వేల విరాళం అందినట్లు ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. దాతకు ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు. అలాగే రాజమహేంద్రవరానికి చెందిన ఆకుల సురేష్, లీలా భవాని దంపతులు రూ.15,620 విరాళం అందించారు.

దోమకాటు.. ఆరోగ్యానికి చేటు

అంబాజీపేట: వర్షాలు కురవడంతో దోమలు విపరీతంగా పెరిగి ఆరోగ్యానికి చేటు తెస్తాయని వాటి పట్ల అప్రమతంగా ఉండాలని వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీ సీహెచ్‌ఓ బి.అప్పారావు అధ్యక్షతన జాతీయ కీటకజనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందకుండా నివారణ మందులను స్ప్రే చేయాలని సూచించారు. వివిధ రకాల జ్వరాలు, రోగాలు ఆడ అనాఫిలిస్ దోమ ద్వారానే వ్యాపిస్తాయని అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ మేరీకృప, హెల్త్ సూపర్‌వైజర్ ఎన్.మధుబాబు, స్టాఫ్ నర్స్ విజయ, హెల్త్ అసిస్టెంట్‌లు మురళి, కిమ్స్ వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకే పరిమితం చేయాలి



మలికిపురంలో ఎస్టీయూ ఉపాధ్యాయుల డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

సఖినేటిపల్లి: తల్లికి వందనం పథకం కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు పరిమితం చేయాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు మంగళవారం మండల ఎస్టీయూ శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎమ్మెల్యేను మలికిపురం ఎల్ఎస్ ల్యాండ్ మార్క్‌లో కలసి, సంఘం తరపున ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్టీయూ ఉపాధ్యాయుల డైరీని ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరింప చేశారు. కాగా మెర్జింగ్ వల్ల ఇబ్బందులు పడుతున్న పాఠశాలలకు జీవో 117 రద్దు చేయించే విధంగా చూడాలని కోరారు. మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాసు, ప్రధాన కార్యదర్శి యు.గిరిబాబు, జీవీవీ కృష్ణప్రసాద్, ఉండపల్లి సత్యనారాయణ, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత



రాజోలులో మొక్కలు నాటుతున్న మాజీ ఎమ్మెల్యే వేమా

రాజోలు: పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు అమ్మపేరుతో ఒక మొక్క కార్యక్రమాన్ని వేమా ప్రారంభించారు. నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ జొన్నలగడ్డ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో రాజోలు కాటన్‌పార్కు ఏటిగట్టు వద్ద మొక్కలు నాటారు. మండల బీజేపీ అధ్యక్షుడు పితాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నెట్‌వర్క్ లేకుండా ధరలు పెంచడం దారుణం

అంబాజీపేట: ఇటీవల జియో, ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ కంపెనీలు తమ సర్వీసు వ్యాట్‌లను దారుణంగా 25 శాతం ధరలు పెంచారే తప్ప వినియోగదారులకు నాణ్యమైన నెట్‌వర్క్‌ను అందించడంలో విఫలమయ్యారని కోకోఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి, కార్యదర్శి ఎస్.ఆదిత్యలు విమర్శించారు. ఇతర కంపెనీల నెట్‌వర్క్‌లను తమ కంపెనీలకు మార్చుకునేందుకు ఆకర్షణీయమైన పథకాలను పెట్టి కనెక్షన్లను పెంచుకుంటున్నారని విమర్శించారు. వినియోగదారులను పెంచుకోవడంలో ఉన్న శ్రద్ధ జియో, ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ విషయంలో లేదన్నారు. నెట్ వర్క్ సక్రమంగా లేదని ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఏకపక్షంగా చార్జీలు పెంచడం ట్రాయ్ నిబంధనలు ధిక్కరించడమే అవుతుందన్నారు. ఈ విషయంపై చార్జీలను పునరాలోచించాలని లేకుంటే ట్రాయ్ అథారిటీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

దీవిలో తాగునీటికి నిధుల వరద

- గత ప్రభుత్వం హయాంలో తాగునీటి ప్రాజెక్టు గణనీయ అభివృద్ధి
- రూ.25 కోట్లతో అదనపు ట్యాంకులు, ఇంటింటికీ కుళాయిలు
- మరో రూ.15 కోట్లతో చురుకుగా అంతర్వేది దేవస్థానం తాగునీటి ప్రాజెక్టు



గుడిమెళ్లంకలో నూతనంగా నిర్మించిన 500 ఎంఎల్‌డీ ర్యాపిడ్ ఫిల్టర్ యూనిట్

మలికిపురం: రాజోలు దీవిలో తాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి గణనీయంగా జరిగింది. 2019కి ముందు నియోజకవర్గంలో గ్రామాలు తాగునీటి ఎద్దడితో సతమతం అయ్యేవి. వేసవి వచ్చిందంటే ప్రజలు మరీ అవస్థలు పడేవారు. వేసవిలో నియోజకవర్గంలో కొన్ని తాగునీటి ఫిల్టర్ లేక ప్రాజెక్టులు మూత పడే పరిస్థితులు కూడా ఉండేవి. అటువంటి పరిస్థితుల నుంచి గట్టెక్కించింది గత జగన్ సర్కారు. ప్రధానంగా నియోజకవర్గంలో భారీ తాగునీటి ప్రాజెక్టు అయిన గుడిమెళ్లంక ప్రాజెక్టు ద్వారా రాజోలు మండలంలో అత్యధిక జనాభా గల రాజోలు, శివకోడు గ్రామాలతో పాటు మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు తాగునీటిని అందిస్తున్నారు. గతంలో ఈ ప్రాజెక్టు అనేక సమస్యలతో సతమతం అయ్యేది. ఫిల్టర్లు మొరాయించడం, విద్యుత్ కోత, అరకొర ఫిల్టర్‌తో పూర్తి స్థాయిలో గ్రామాలకు నీరందించలేక పోయేవారు. జగన్ సీఎం అయ్యాక ఇక్కడ పరిస్థితి మారింది.

అదనంగా రూ.2.5 కోట్లతో 500 ఎంఎల్‌డీ ర్యాపిడ్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేశారు. గతంలో ఇక్కడ రోజుకు 60 లక్షల లీటర్ల తాగునీటిని ఫిల్టర్ చేస్తే ఇప్పుడు రోజుకు 50 లక్షల లీటర్ల నీటిని అదనంగా శుద్ధి చేసి ప్రజలకు అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు పరిధిలో మొత్తం రోజుకు 1.10 కోట్ల లీటర్ల తాగునీటిని ఫిల్టర్ చేసి ప్రజలకు అందిస్తున్నారు. ఇక నియోజకవర్గంలో జల్‌జీవన్ పథకంలో మొత్తం 25 అదనపు ట్యాంకులను నిర్మాణం చేశారు. అలాగే ఇంటింటికీ తాగునీటి పైప్ లైన్లు వేసి కుళాయిలు కూడా అందిస్తున్నారు. మరో నెల రోజుల్లో ఈ ట్యాంకులు కూడా పనులు పూర్తయి నీటి సరఫరా ప్రారంభం అవుతుంది. అలాగే వేసవిలో తాగునీటి ప్రాజెక్టులకు విద్యుత్ కోత లేకుండా మలికిపురం, లక్కవరం, సబ్‌స్టేషన్లలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లు కూడా వేసి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఇక సముద్ర తీర గ్రామాలైన అంతర్వేది పరిసర గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని అంతర్వేది దేవస్థానం గ్రామంలో రూ.15 కోట్లతో కొత్తగా తాగునీటి ప్రాజెక్టు నెలకొల్పుతుంది. గత ఆరు నెలలుగా ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ పాజెక్టు పూర్తయితే తీర గ్రామాల్లో తాగునీటి సమస్యలకు మంగళం పాడినట్లే.

50 శాతం కుటుంబాలకు ఇంటింటికీ కుళాయిలు

రాజోలు దీవిలో 2019కి ముందు ఇంటింటికీ కుళాయిలు లేవు. కేవలం కాలనీలో ఒకటి, రెండు కుళాయిలు ఉండేవి. అక్రమ కుళాయిల వల్ల నీటి సరఫరా సరిగా అందేది కాదు. వేసవిలో ప్రభుత్వం, దాతలు కూడా ప్రత్యేక ట్యాంకర్లతో ప్రజలకు నీటిని అందించే వారు. అయితే 2019 అనంతరం పరిస్థితుల్లో మార్పు వచ్చింది. జల్ జీవన్‌లో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. ప్రస్తుతం నియోజక వర్గంలో 50 శాతం గృహాలకు ఇంటింటికీ కుళాయిలు దాదాపు ఏర్పాటు అయ్యాయి.

తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం ఇచ్చాం



రాజోలు దీవిలో ఉప్పునీటి ప్రభావం వల్ల ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడేవారు. దానిని గమనించి నియోజక వర్గంలో జగన్ హయాంలో రూ.25 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు అందించే లక్ష్యంగా చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. అంతర్వేది దేవస్థానంలో రూ.15 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు పనులు చేపట్టాం. ప్రస్తుత ప్రభుత్వం వాటిని వేగంగా పూర్తి చేస్తుందని భావిస్తున్నాం.

– రాపాక వర ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే, రాజోలు

ఇంటింటికీ తాగునీటి కుళాయిలు



తాగునీటి సమస్యలపై ఇటీవల అధికారులతో సమీక్ష నిర్వహించాం. ప్రస్తుతం నియోజక వర్గంలో జరుగుతున్న తాగునీటి ప్రాజుక్టు పనులు వేగవంతం చేయడంతో పాటు శివారు గ్రామాలకు సైతం నూరుశాతం కుటుంబాలకు ఇంటింటికీ తాగునీటి కుళాయిలు వేసే లక్ష్యంగా ముందుకు సాగుతాం.

– దేవ వరప్రసాద్, రాజోలు, ఎమ్మెల్యే

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల వచ్చే ఏడాది లోపు నూరు శాతం ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఆ దిశగా ప్రస్తుత ప్రభుత్వం కూడా తగిన చర్యలు తీసుకుంటుంది.

చుట్టూ ఉప్పునీరే..

రాజోలు దీవిలో చుట్టూ ఉప్పునీరే. చుట్టూ సముద్రం గోదావరి పాయలు ఉన్న ఈ ప్రాంతం పూర్తిగా ఉప్పునీరు ఉంటుంది. మరో వైపు ఆక్వా సాగు వల్ల గ్రామాల్లో తాగునీటి బావులు సైతం ఉప్పునీటి మయం అయ్యాయి. ఓఎన్జీసీ కార్యకలాపాల వల్ల ఇక్కడ భూమి మూడు అంగుళాల కిందికి కుంగి సముద్రం నుంచి ఉప్పు నీరు గ్రామాల్లోకి డ్రైన్ల ద్వారా ఎగబాకుతుంది. దీంతో ఇక్కడ గ్రామాల్లోని బావుల్లో ఉప్పునీరే ఉంటుంది. అక్కడక్కడా తాగునీటి బావులున్నా వేసవిలో వాటిలో చుక్క నీరుండదు. ఈ సమస్య కోసమే ఇక్కడ తాగునీటి ప్రాజెక్టులు ఏర్పాటు చేశారు. అయితే 2019 ముందు వాటి నిర్వహణ అధ్వానంగా ఉండేది.

ఇంటి పైకప్పు మరమ్మతుకు ఆర్థిక సాయం



సఖినేటిపల్లి రత్నాలపేటలో బాల సుందర్రావుకు ఆర్థిక సాయం చేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ

సఖినేటిపల్లి: కువైట్ కేంద్రంగా ఉన్న సామాజిక సేవా సంఘం ఆదర్శ ఆంధ్రాయూత్, సఖినేటిపల్లి రత్నాలపేటకు చెందిన గొల్ల బాలసుందర్రావుకు రూ.15 వేలు ఆర్థిక సాయం మంగళవారం పంపిణీ చేశారు. పేద కుటుంబానికి చెందిన బాల సుందర్రావు మంచానికే పరిమితమయ్యాడు. ఇంటి పై కప్పు దెబ్బతిని వర్షాలకు ఆ కుటుంబం అవస్థలు పడుతోంది. దీంతో ఈ విషయాన్ని స్థానికుడు నల్లి మాధవరావు ఆదర్శ ఆంధ్రా యూత్(కువైట్)కార్యవర్గ మెంబర్ నల్లి ఏసురత్నంకు తెలిపారు. ఈ మేరకు సేవా సంఘం నుంచి పై కప్పు వేసుకునేందుకు రూ.15 వేలు సాయం చేశారు. గ్రామ పెద్దలు ఆ కుటుంబానికి అందజేశారు. తాడి సహదేవ్, నల్లి ప్రేమానందం, నల్లి బాలరాజు, గొల్ల మధు, కాట్రు రవికుమార్, గొల్ల ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా రావులమ్మ జాతర

అంబాజీపేట: వాకలగరువులో వేంచేసిన రావులమ్మ అమ్మవారి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాతరలో భాగంగా అమ్మవారి పూజఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. అలాగే జాతరలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అమ్మవారి తీర్థం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ధాన్యం సొమ్ము జమ అవ్వక ఇబ్బందులు



సఖినేటిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పరషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

సఖినేటిపల్లి: గత దాళ్వా సీజన్‌కు సంబంధించి వరి పండించిన రైతులకు ఇంత వరకూ ధాన్యం సొమ్ము జమ కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఉయ్యూరువారి మెరక సర్పంచ్ ఓగూరి రత్నకుమారి సభ దృష్టికి తెచ్చారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో శాఖల వారీగా ఎంపీడీవో పీవీ సత్యనారాయణ రివ్యూ చేశారు. సభ ప్రారంభంలో ఎంపీపీ మల్లిబాబు మాట్లాడుతూ, మండలంలో అన్ని గ్రామాలకు దగ్గరగా ఉండే ఏరియాలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు ప్రభుత్వ స్థలం ఏర్పాటు చేయాలని తహసీల్దారు సీహెచ్ పెద్దిరాజుకు విజ్ఞప్తి చేశారు. అనంతరం వ్యవసాయ శాఖకు సంబంధించి ఏవో పీవీ నరసింహరావు మాట్లాడుతున్న దశలో, సర్పంచ్ రత్నకుమారి రైతుల ధాన్యం బకాయిలు గురించి పై విధంగా సభ దృష్టికి తెచ్చారు. దీనిపై ఏవో వివరణ ఇస్తూ, ఏప్రిల్ 26 తరువాత మండల వ్యాప్తంగా ధాన్యం అమ్ముకున్న 247 మంది రైతులకు రూ.3,37,38,567 సొమ్ము వారి ఖాతాలకు జమ కావాల్సి ఉందన్నారు. అయితే మా వైపు నుంచి ఎటువంటి లోపం లేదని, సొమ్ము జమ చేయడం కేవలం పౌరసరఫరాల శాఖ అధికారులదే బాధ్యత అని వెల్లడించారు. ఈ నెల మొదటి వారంలో నిధులు జమయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పరంగా జూలై 1న పంపిణీ చేసిన పింఛన్ పంపిణీ పై తమకు ఎటువంటి సమాచారం లేదని కో ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్, ఎంపీటీసీలు దొండపాటి సునీత, గుబ్బల అంజిబాబు, సర్పంచ్ ఓగూరి రత్నకుమారి, ఎంపీడీవో పీవీ సత్యనారాయణ దృష్టికి తెచ్చారు. అయితే ఇకపై ప్రభుత్వ పరంగా జరిగే కార్యక్రమాలకు ఆయా సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశాలు ఇచ్చారు. గొందిలో 5 వేలు జనాభాకు జేజేఎంలో నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకులు కట్టారని, వీటికి నీరు పంపింగ్ చేసేందుకు విద్యుత్ సరఫరా నిమిత్తం తగిన ట్యాన్స్‌ఫార్మర్ లేక తాగునీటి సమస్య నెలకొని ఉందని ఎంపీటీసీ కొల్లాబత్తుల శుభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ దృష్టికి తెచ్చారు. అలాగే పల్లిపాలెంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ ఒడుగు శ్రీను కూడా ఆ శాఖకు విజ్ఞప్తి చేశారు. అంతర్వేది దేవస్థానంలో కొత్తగా నిర్మించిన సబ్‌సెంటర్ భవనంలో వైద్య సేవలు త్వరలో అందుబాటులోకి వచ్చే విధంగా చూడాలని ఎంపీటీసీ బైరా నాగరాజు, రామేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీటీసీలు రాపాక దీవెన కుమారి, రుద్రరాజు చినరాజా, నల్లి రత్న కుమార్, ఉండపల్లి సాయికుమారి, చొప్పల బాబూరావు, ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రాజన్, ఏఈ శిరీష, పంచాయతీ రాజ్ డీఈ శ్రీరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కి రాని సరిహద్దు ఆస్తుల పంపకం



చొప్పెల్లలో ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొన్న గ్రామ పెద్దలు

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, చెముడులంక గ్రామాల మధ్య గత మూడు దశాబ్దాలుగా జరుగుతున్న సరిహద్దుల ఆస్తి పంపకాల వివాదంపై మంగళవారం జరిపిన చర్చల్లో ఎటువంటి పురోగతి కనిపించలేదు. వివరాల్లోకి వెళితే 1995లో చొప్పెల్ల గ్రామపంచాయతీ నుంచి చెముడులంక విడిపోయి ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడింది. అప్పటి జిల్లా కలెక్టర్ ఒకటి నుంచి 74వ సర్వే నంబర్ వరకు గల ఆస్తులను చెముడులంక పంచాయతీకి, 75 నుంచి తుది సర్వే నంబరు వరకు చొప్పెల్ల పంచాయతీకి కేటాయించారు. చొప్పెల్లకు చెందిన ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ముఖ్యమైన ప్రదేశాలు చెముడులంక పంచాయతీలోకి చేరాయి. దీంతో పాటు 1500 మంది జనాభా కూడా అదే పంచాయతీలో చేర్చాల్సి వచ్చింది. అప్పట్లో ఈ విభజన వల్ల చొప్పెల్ల గ్రామ పంచాయతీకి తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆ గ్రామస్తులు నిరసన తెలియజేశారు. ఒకటి నుంచి 27 సర్వే నంబర్ వరకు గల ఆస్తులను మాత్రమే చెముడులంకకు విలీనం చేయాలని అప్పటి చొప్పెల్ల సర్పంచ్ దంగేటి పెద్ద సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఈ వివాదం పరిష్కారం కాకుండా తాత్కాలికంగా బ్రేక్ పడింది.

అప్పటి ఆదేశాలు అమలు చేయాలి

చెముడులంక గ్రామ సర్పంచ్ తమ్మన శ్రీనివాసు మళ్లీ 1995లో కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలంటూ హైకోర్టును ఆశ్రయించడంతో వివాదం మళ్లీ మొదటికి వచ్చింది. జిల్లాల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్తపేట ఆర్‌డీఓ ఆర్‌వీవీ సత్యనారాయణ నేతృత్వంలో డీఎల్పీఓ ఏ రాజు, తహసీల్దార్ డీవీఎస్ రాజ్ కుమార్‌తో కూడిన అధికారుల బృందం మంగళవారం ఆ రెండు గ్రామాల్లో పర్యటించి గ్రామ సరిహద్దులను పరిశీలించింది. అనంతరం చొప్పెల్ల పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్‌లు తమ్మన శ్రీనివాసు, దంగేటి చంద్రకళ నేతృత్వంలో ఇరు గ్రామాల పెద్దల సమక్షంలో సమస్యపై చర్చించారు. ఇరు గ్రామాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో ఈ సరిహద్దు సమస్యలపై మరింత లోతుగా అధ్యయనం చేసి తుది నిర్ణయం తీసుకుంటామని ఆర్‌డీఓ సత్యనారాయణ హామీ ఇచ్చారు. గ్రామ పెద్దలు మెర్ల గోపాలస్వామి, ఆకుల రామకృష్ణ, దంగేటి బాపనయ్య, నయనాల శ్రీరామ చంద్రమూర్తి, తమ్మన గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



లూటుకుర్రులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న సర్పంచ్ తాతకాపు, డాక్టర్ రమ్యశైలజ



పుల్లేటికుర్రులో డయేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మామిడికుదురు: ప్రజలు తగిన ఆరోగ్య జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండాలని సర్పంచ్ అడబాల తాతకాపు సూచించారు. లూటుకుర్రు పీహెచ్‌సీలో మంగళవారం డయేరియాపై అవగాహనా సదస్సు జరిగింది. పీహెచ్‌సీ వైద్యాధికారి రమ్యశైలజ మాట్లాడుతూ దోమల వల్ల డయేరియాతో పాటు పలు అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు కనీస జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. దీనిలో భాగంగా డయేరియా నివారణ చర్యలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. చిన్నారుల ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో డయేరియా నివారణ

అంబాజీపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగితే డయేరియాను నివారించవచ్చని ముక్కామల పీహెచ్‌సీ వైద్యాధికారి జీవీ గీతాంజలి అన్నారు. పుల్లేటికుర్రు, కె.పెదపూడి, ఇరుసుమండ, చిరతపూడి, పసుపల్లి, ముక్కామల, వక్కలంక, మొసలపల్లి గ్రామాల్లో స్టాప్ డయేరియా మాసోత్సవాలను మంగళవారం నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ ఎ.రాధా నరసింహం, సీహెచ్‌ఓ రవికుమార్‌ల ఆధ్వర్యంలో సర్పంచ్‌లు జల్లి బాలరాజు, వాసంశెట్టి రేవతి, మట్టపర్తి నాగరాజు, అక్కిశెట్టి నాగమణి అధ్యక్షతన డయేరియా నిర్మూలన అవగాహన ర్యాలీని నిర్వహించారు. గీతాంజలి మాట్లాడుతూ జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా వ్యాధిపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. ప్రతి ఇంటిలోనూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎవరికైనా వ్యాధి లక్షణాలు కలిగి ఉన్నట్లయితే వెంటనే వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. ఈ ర్యాలీల్లో ఎంపీటీసీలు వడలి కృష్ణమూర్తి, పబ్బినీడి రాంబాబు, బుడితి సత్యనారాయణమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియాను నియంత్రిద్దాం

ఆలమూరు: డయేరియా (అతిసార) వ్యాధిని పూర్తిగా నిర్మూలించి చిన్నారుల ఆరోగ్యాన్ని పరిరక్షిద్దామని కొత్తపేట డివిజన్ అదనపు జిల్లా వైద్యాధికారిణి ఎం.సుమలత అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం డయేరియా నియంత్రణపై ప్రత్యేక అవగాహన సదస్సులు జరిగాయి. వైద్యారోగ్య సిబ్బంది డయేరియా నియంత్రణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. అపరిశుభ్ర వాతావరణం వల్ల సంభవించే అంటువ్యాధుల ప్రభావం వల్ల డయేరియా వ్యాప్తి చెందుతుందన్నారు. దీనివల్ల డయేరియా సోకిన చిన్నారులు త్వరితగతిన బరువు తగ్గడంతో పాటు జ్వరం, వికారం తీవ్రంగా వస్తుందన్నారు. అలాంటి సమయంలో మల విసర్జన అధికంగా ఉన్న చిన్నారులపై తీవ్ర ప్రభావం చూపి ప్రాణాంతకం అవుతుందన్నారు. డయేరియా నియంత్రణకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, ఏఎన్ఎం టి.సుశీల, ఎంఎల్‌హెచ్‌పీ కె.షారోన్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఆడిట్ అభ్యంతరాలతో రూ.20 వేల రికవరీ



మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సామాజిక తనిఖీ సమావేశంలో పాల్గొన్న అధికారులు

అయినవిల్లి: మండలంలోని 21 గ్రామాల్లో 2023–2024 సంవత్సరానికి సంబంధించి సోషల్ ఆడిట్ అభ్యంతరాలు తెలియజేయండంతో క్షేత్ర సాయి సిబ్బంది నుంచి రూ.20 వేలు నగదు రికవరీ చేసినట్లు డ్వామా పీడీ ఎస్.మధుసూదనరావు తెలిపారు. మంగళవారం 2023–24కి సంబంధించి సామాజిక తనిఖీ నివేదికలను ఎస్ఆర్‌పీ కనకరావు, డీఆర్పీలు చదివి వినిపించారు. అయితే ఆర్థిక సంవత్సరానికి ఉపాధి కూలీలకు వేతనం ద్వారా రూ.8.47 కోట్లు చెల్లించామన్నారు. అలాగే మెటీరియల్ నిమిత్తం రూ.2.09 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అయితే గ్రామాల్లో మొక్కలు నాటినట్లు చూపించారన్నారు. అక్కడ మొక్కలు నాటిన ఆనవాళ్లు లేవని, అలాగే పంట బోదెలు తవ్విన ఆనవాళ్లూ లేవన్నారు. వీటికి మాత్రం వేతనాలు చెల్లించినట్లు రికార్డు చేసినట్లు తెలిపారు. మస్తర్లల్లో సంతకాలు, వేలిముద్రలు లేకపోవడం, కూడికల్లో తేడాలు, రుద్దివేతలు ఉన్నట్లు గమనించినట్లు తెలిపారు. రైతులు కొబ్బరి తోటల్లో అంతరపంటల సాగుకు, వాటి మెయింటెనెన్స్‌కు ఉపాధి హామీలో నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తి, జిల్లా విజిలెన్స్ అధికారి కె.భీమేశ్వరరావు, అంబుడ్స్‌పర్సన్ ఎ.శ్రీనివాసరావు, ఏపీడీఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



కె.పెదపూడిలో బడి బయట విద్యార్థి, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ ప్రకాష్

అంబాజీపేట: అన్ని వసతులు కలిగి ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో బడి బయట ఉన్న విద్యార్థులను వారి తల్లిదండ్రులు చేర్పించాలని ఎంఈఓ–2 మోకా ప్రకాష్ అన్నారు. కె.పెదపూడిలో 'నేను బడికి పోతాం'లో భాగంగా బడిబయట ఉన్న విద్యార్థులను మంగళవారం కలసి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఎంఈఓ ప్రకాష్ మాట్లాడుతూ గ్రామాల్లో బడి బయట పిల్లలు లేకుండా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, అందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోను విద్యాబోధన జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీలను సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ పి.గోవిందరాజు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మామిడికుదురు సమావేశంలో పాల్గొన్న వలంటీర్లు

మామిడికుదురు: కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజలకు సేవలందించిన తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని రాజీనామా చేయని వలంటీర్లు కోరారు. మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో సంఘం ప్రతినిధులు కొల్లు లక్ష్మణ్, బాలం వెంకటేశ్వరరావు, మహ్మద్ రఫీ మాట్లాడారు. ఉపాధి కోసం తాము వలంటీర్లుగా చేరామన్నారు. మండలంలో మొత్తం 500 మంది వలంటీర్లకు 350 మంది రాజీనామా చేశారని 150 మంది రాజీనామా చేయలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా రూ.10 వేలు జీతం అందించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. తమపై ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. రాజకీయంగా ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా తాము వాటిని లెక్క చేయలేదన్నారు. తమకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆశిస్తున్నామన్నారు. సమావేశంలో వలంటీర్లు పాల్గొన్నారు.

కొద్దిపాటి వర్షానికే పెదపట్నం కరకట్ట ఇలా..



వర్షానికి అధ్వానంగా మారిన పెదపట్నం ఏటిగట్టు

మామిడికుదురు: మామిడికుదురు కొర్లగుంట నుంచి పెదపట్నం వెళ్లే కరకట్ట మార్గం కొద్ది పాటి వర్షానికే చిత్తడిగా మరుతోంది. చినుకులు పడితే చాలు ఆ మార్గంలో వెళ్లే అవకాశం లేకుండా పోతుంది. అరకిలోమీటరు లోపు ఉండే ఈ మార్గంలో రోడ్డు నిర్మించాలని స్థానికులు ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నా ఫలితం మాత్రం శూన్యం. దీంతో సుమారు రెండు కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెదపటం నుంచి మండల కేంద్రం మామిడికుదురుతో పాటు అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు వెళ్లేందుకు కరకట్ట మార్గం ఎంతో దగ్గరగా ఉంటుంది. ఈ గ్రామాల వారు పెదపట్నం వెళ్లాలన్నా, ఆ గ్రామం నుంచి పైన పేర్కొన్న నాలుగు గ్రామాలకు రావాలన్నా ఇదే దగ్గర మార్గం. అరకిలో మీటరు రోడ్డు నిర్మిస్తే ఎంతో ప్రయోజనం ఉంటుంది. కానీ దాన్ని ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వర్షాకాలంలో పడే అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. దీనిపై ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అర కిలో మీటరు మేర ఏటిగట్టు మార్గంలో రోడ్డు నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

చిన్నారి శస్త్ర చికిత్సకు రూ.75 వేల సాయం



వెదిరేశ్వరంలో అఖిల్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: మండలంలోని వెదిరేశ్వరం గ్రామ శివారు మూలగూడెంకు చెందిన ఇళ్ల వెంకటేశ్వరరావు, నాగలక్ష్మి దంపతుల ఐదు నెలల చిన్నారి అఖిల్‌కు లివర్ మార్పిడి శస్త్ర చికిత్స అవసరమైంది. ఈ శస్త్ర చికిత్సకు రూ.25 లక్షల వరకూ వ్యయం అవుతుందని కార్పొరేట్ వైద్యులు తెలిపారన్నారు. డ్రైవర్‌గా జీవనం సాగించే తండ్రికి అంత స్తోమత లేకపోవడంతో సాయం కోసం ఎదురు చూస్తున్నారు. విషయం తెలుసుకున్న కాశీ అన్నపూర్ణ దేవి సేవా సంస్థ తమ సభ్యుల సహకారంతో రూ.75 వేలు నగదును మంగళవారం అఖిల్ కుటుంబ సభ్యులకు అందజేశారు.